## సొంత లాభం

# ఎంత మానుకు...?

"సార్! ఈ జాగా ఎవరిది?" అదరా బాదరాగా వచ్చిన ఆ ఆసామీ నన్నడిగాడు, నా సీటు పక్క కనబడుతున్న అర్ధంగుళం ఖాళీ నేపు చూపుతూ.

సమాధానం కోసం ఒక్క క్షణమైనా ఆగితే ఒట్టు!

అవతలి మనిషినీ నన్నూ ఆ ఆవలింతల మనిషి మీదికి నెట్టేసి మరీ ఒరుసుకు పోయాడు.

ఈ కూర్చున్న సొంపుకి మళ్లీ పిచ్చాపాటీ ప్రశ్నలొకటి... వేధించడానికి!

బయల్దేరిన బండి ఈ స్టేషన్ దాటి మరో స్టేషన్‌కు చేరుకుంది. ఇంతసేపూ ముద్ద ముద్దై కూర్చోడం వల్లి ఎక్కడి కీళ్లు అక్కడ పట్టేశాయి. అంచేత ప్లాట్ ఫారం మీద ఈ శరీరాన్ని కాస్త విదిలించుకుందామని బండి



దిగబోతూ, 'మాస్తాండ'మని నా సీటును అతనికి అప్పజెప్పి పోయాను.

నేను చేసిన పొరపాటు ఇదే!

తిరిగి వచ్చి చూసేప్పటికి నా సీట్లో ఇంకో వ్యక్తి మరో వ్యక్తి...- అతని స్నేహితులట వీళ్లు!

"పర్లేదుసార్, సర్దుకుందాం రండి" అన్నాడతను నన్ను చూసి. తృప్తి పడమా మరి!

"ఈ మాట అనాల్సింది మీరా? నేనా?" అన్నా న్నేను.

వాంఛించిన మౌనం మండి తృటిలోనే తేరుకుని, "నేనే" అన్నాడు స్థిరంగా.

"ఎంచేత?" అడిగాను విస్తుపోతూ.

"మీ సీటును ఆక్రమించి కూర్చున్నాం గదా అంచేత!"

ఈ వివరణ విని అవాక్కైనాను.

కదలిన బండి పొగ నుంచి ఇంత బొగ్గు వచ్చి నా ముఖానికి రుద్దుకొని నా జేబులోకి రాలింది.

—రమణమూర్తి బల్లెడ

## దొంగలు



'ఎదవ కోడి ఎంత పని జేసింది' అంటూ యథావిధిగా ఏడవసారి గొణిగాడు రంగయ్య. ఇంతకాలం గోడ గడియారంలా టంచన్‌గా తెల్లవారు ఝామున లేపేది. ఇవ్వాళ దీనికేం మొచ్చింది? అర్థాంతరంగా కూసింది! తుమ్మల తోపు వచ్చేసరికి తెల్లవారు తుందనుకుంటే తెల్ల వారటమటుంచి చీకటి యింకా దట్టమై తుమ్మల తోపులా తనముందు నిలబడింది.

ఆలోచించుకుంటూ అనుమానంగా అడుగులు వేస్తున్న తాతకు చప్పుడు వినిపించి వెనక్కు తిరిగి చూచాడు.

మామూలు పంచె, అరచేతుల చొక్కా, జుట్టు ముడి, పై కండువాతో మసగ మసగ్గా కనపడ్డ మనిషిని చూసి రంగయ్య తాతకు భయం వెయ్యకపోగా ఉన్న భయం పోయి సంతోషంగా శ్వాస పీల్చుకున్నాడు. 'మనిషి తోడు దొరికింది, పరవాలేదు,' అనుకున్నాడు.

"ఏ ఊరు తాతా ఇంత రాత్తిరేల బయలుదేరావు" అన్నాడా వ్యక్తి. ఇంత సేపు మనసు లోనే సుళ్ళు తిరుగుతున్న కోడి మీద కోపం ఒక్కసారి భళ్ళున బైటపడింది. "ఏమీ చెప్పేదిలే నాయినా. కోడిని నమ్ము కొని యేట్లోకి దిగినా. అర్ధరేతికి కూసి నా దుంప దెంచింది" అన్నాడు తాత. "మీ దేవూరు ? ఎక్కడి కెళ్ళాలి? నీవుతోడుండావు కన క సరిపోయింది కాని లేకుంటే నాగతేంకాను?" అంటూ నిశ్వసించాడు. ఆ నిశ్వాసంలో ఎంత విశ్వాసం! "నేను తోడు లేక పోతే మాత్రం నిన్ను ఏం చేస్తారు. తాత? నీ దగ్గరేముందని అన్నాడావ్యక్తి.

రంగయ్య తాత చిన్నగా నవ్వి, మంద్రస్థాయిలో "నన్నేమి చేసినా ఫరావాలేదు నాయనా! నా కూతురి బతుకు భంగమై పోతుందనే నా బాధ. దాని జీవితం గాలిలో దీపంలా ఉంది. ఎట్టాగో ఆయేదు కొండల వాడి దయవలన వాడి మనసు మారి,కట్నం లేకపోతే మానె గుడ్డలు పెట్టి పంపించు, తీసికెళ్తానంటూ జాబు రాశాడు. ముసలోళ్ళం కూలి నాలీ చేసి రెక్క విరుసుకున్న మొత్తం మూడు వందలుంటే గుడ్డలు తెద్దామని పట్నం బయలు దేరాను. దీని పాడుగాను ఈ కోడి..."


ఆ వ్యక్తి గట్టిగా నవ్వాడు "కోడిదేందిలే తాత. మనరాత బాగుండాలి గాని" అన్నాడు.


రాత అనగానే తాతకు వేదాంతం గుర్తుకు వచ్చి "ఏందోలే నాయనా, ఏదో ఒక రోజు ఈ ఆకు రాలి పోయేదే కదా! అయితే ఉన్న నాలుగు రోజులు ఈ ఊగులాట తప్పదనుకో" అంటూ ఎదురుగా చూసి తాత నిర్ఘాంత పోయాడు. నల్లగా తుమ్మ మొద్దులాంటి నలుగురు మనుషులు. చేతిలో దుడ్డు కర్రలు! "ఏందిరా ముసలోడా! ఏదైనా తెస్తున్నవా? ఊరికే ఊగులాడు కుంటూ వస్తున్నవా" అంటూ కర్ర అడ్డం పెట్టారు.

వేదాంతం ఇగిరిపోయి వళ్ళంతా చెమట పట్టింది తాతకు నోరు పెగలడం లేదు. పక్క నున్న మనిషి వైపు చూశాడు నీ వేదిక్కన్నట్టు! "తాత దగ్గర ఉండేది మూడొందలేరా" అన్నాడు నవ్వుతూ 'ఈడు కూడా వాడేనా!' తాత గుండె ఒక్కసారి ఆగిపోయినట్లు యింది. శరీరం వణుకుతూంది. కన్న కూతురి మొఖం కళ్ళ ముందు కనపడి కనుకొలకుల్లో నీళ్ల నిలిచాయి.

"ఏంది ముసలోడా, వణికితే వదలి పెడ్తా మను కున్నావా? ముందా మూడొందలు ఆడ పెట్టు" అన్నా డొకడు కర్కశంగా.

వెంట వచ్చిన మనిషి తాత ముఖం లోకి చూస్తూ మనలాం టి దొంగసొమ్ము కాదురా తాతది. ముస లోళ్ళు చెమటోడ్చి సంపాయించింది. అందులో అది





పి. పాపిరెడ్డి

ఆడకూతురి బతుక్కోసం కూడ బెట్టేంది. దాన్ని ముట్టుకుంటే భగవంతుడుకూడా మనల్ని పెమించడు'' అన్నాడు. వల్గురు మారుమాట లేకుండా పక్కకు తప్పకున్నారు.

తోపు దాటించి వెనుదిరిగిన వ్యక్తి చేతులను తన చేతుల్లోకి తీసికొని కళ్ళ కద్దుకొని“ నీకు కొడుకునైపుట్టి నీ రుణం తీర్చుకుంటాను బాబు'' అన్నాడు తాత. ముడతలు పడ్డ చెక్కిళ్ళ మీద జారే కన్నీటి చుక్కలు తుడిచి ఆనందంగా ఈల వేసుకుంటూ వెళ్ళిపోయాడా వ్యక్తి.

పట్నం పొలిమేరలో మండల ప్రజాపరిషత్తు కార్యాలయం కనపడేసరికి తాతకు తన పట్టా సంగతి గుర్తు కొచ్చింది. యం.ఆర్.వో పట్టాల రామయ్యను కలుసుకొని తన పొలం సంగతి విన్నవించుకొన్నాడు తాత. అయ్యగారు ఆర్రై ఆంజనేయుల వైపు చూపారు. ఆంజనేయులు రంగయ్య తాత వాలకం చూచి హెడ్ గుమస్తా వీరభద్రాన్ని చూపాడు. వీరభద్రం కాగితాల మధ్యన దూరిన గణపతిని చూపాడు. గణపతి విసుగ్గా చూచి అయ్య గార్ని కలవమని మరల కట్టల్లో దూరాడు.'కథ తిరిగి మొదటికొచ్చిందే 'అనుకుంటూ ఏమి చేయాలో తోచక నిలుచున్న రంగయ్య తాతను అటెండరు అప్పారావు ఆపద్బాంధవుడిలా ఆదుకున్నాడు. పార్థునికి పార్థసారథిలా గీతను బోధించాడు. “తాతా నా మాట వినుకో. ముందు గణపతి పూజ చేసుకో. ఆ తర్వాత ఆ ప్రక్కనే 'ఉన్న వీరభద్రయ్య గార్కి కానుకెయ్యి. ఆ తర్వాత ఆర్రై ఆంజనేయులు గార్కి దక్షిణ వేసి దండం పెట్టు. అప్పుడెళ్ళి మూల విరాట్టుకు ముడుపులు చెల్లించుకో. అప్పుడు నీ పని క్షణాల మీద జరిగి పోద్ది'' అన్నాడు అప్పారావు.

“అదేదో నీవే చేసి పెట్టు నాయనా, పాత కాలపు మనిలోన్ని, ఇవన్నీ నాకేమీ తెలుసు?'' అన్నాడు రంగయ్య తాత.

“అసలు జేబులో ఎంతుందో చూడు'' అన్నాడు అప్పారావు.

రంగయ్య తాత జేబులోంచి పొట్లం తీసి “కూతురి కాపురం నిలబెట్టడానికి గుడ్డల కోసం వచ్చాను బాబు. రెండొందలకు తీసుకపోతాను. ఈ వంద తీసుకోని పని చేసి పెట్టు బాబు'' అన్నాడు రంగయ్య తాత.

అద్దం పగిలినట్లు భళ్ళున నవ్వాడు హెడ్ గుమస్తా వీరభద్రం. “బజారుకు వెళ్ళి బొరుగులు కొనుక్కో. పిల్లోల్లకు పెడితే పుణ్యం వస్తది'' అన్నాడు.

ఆర్రై ఆంజనేయులు అందుకున్నాడు. “అదేంటి పెద్దాయనా. నీ పొలం మీద ఎంత ఒత్తిడి వచ్చిందను కున్నావ్. ఒక్క మాటరాస్తే నీ పట్టా ఎగిరి పోతుంది. కన్న కూతురుంటున్నావు గనక చెప్తున్నా, ఆడ పిల్ల తండ్రివి. ఆలస్యం చేస్తే అన్యాయమై పోతావు'' అంటూ“ఆ పొట్లం ఇట్లా పట్టుక రావోయ్ అప్పారావు. ఎట్లాగో ఆ మూడొందలతోనే ముడిపెట్టనయ్యా వీరభద్రం. ఏ చేస్తాం? ఖర్మ!''అంటూ విసుక్కుంటూ ఫైళ్ళు కెలికి ఒక కాగితం పైకి తీసాడు.“దీని మీద వేలు ముద్ర వెయ్యవయ్య పెద్దయ్య'' అంటూ ఆ కాగితం ముందుకు తోసాడు ఆంజనేయులు. వేలు ముద్ర వేసిన కాగితం , నోట్ల పొట్లం ఆంజనేయుల కప్పజెప్పి అవతల కేసును 'టేకప్' చేయడానికి ఆనందంగా వెళ్ళాడు అప్పారావు.

ఒట్టి చేతులతో ఇల్లు చేరిన రంగయ్య తాతను చూచి వాకిట్లోనేని లేపి “చీరలేవి?” అంది సీతమ్మవ్వ. “డబ్బులు దొంగలు కొట్టేశారు'' అన్నాడు రంగయ్య తాత నింపాదిగా.

## అదీ సంగతి

సత్యమూర్తి ప్రవర్తన నాకేం నచ్చలేదు. బంగారం లాంటి సంబంధం ఎందుకు కాదంటున్నాడో అర్థం కాలేదు.

సత్యమూర్తికి ముగ్గురు అమ్మాయిలు. పెద్ద అమ్మాయిని బ్యాంకు ఆఫీసరుకిచ్చాడు. రెండో అమ్మాయిని ఆర్టీసీ కండక్టర్‌కిచ్చాడు. ఇహ మూడో అమ్మాయి పెళ్ళికోసం తిరగని ఊరు అంటూ లేదు. వెతకని సంబంధం అంటూ లేదు. అటువంటి సమయంలో మంచి సంబంధం దొరికింది.

అబ్బాయి బ్యాంకులో ఆఫీసర్‌గా చేస్తున్నాడు. అందంగా వున్నాడు. పైగా కట్నం చాలా తక్కువ. అటువంటి సంబంధం ఎందుకు ఇష్టపడడం లేదో వాడి స్నేహితుడిగా తెలుసుకోలేక పోతున్నాను.



ఈ విషయమై వాడి పెద్ద కూతురుతో మాట్లాడదామని వాళ్ళ ఊరు వెళ్ళాను. అదో పల్లెటూరు. ఇల్లు కష్టం లేకుండా పట్టుకోగలిగాను.

అక్కడి పరిస్థితి చూసి నా నోటే వెంట మాట రాక అలా నిల్చుండిపోయాను. సావిత్రి దొడ్లో పిడకలు చేస్తూంది. వాళ్ళాయన గేదెల్ని గడ్డి పెట్టే తోముతున్నాడు.

విషయమేమిటంటే ఆ ఊళ్ళో వాళ్ళకి గేదెలు, ఆవులు కొనుక్కోమని అప్పులు ఇచ్చారట! తీసుకున్న అప్పులు ఎంతకీ తీర్చడం లేదని, తీసుకున్న అప్పులు తీర్చమని బ్యాంకు వాళ్ళు అడిగేసరికి వాళ్ళంతా “అప్పులు తీర్చడానికి మా దగ్గర డబ్బులు లేవు. కావాలంటే మీరిచ్చిన గేదెలు, ఆవులు తీసుకోండని ఈ ఆఫీసర్ ఇంట్లో వదిలి వెళ్ళిపోయారట.

సత్యమూర్తి ఆ బ్యాంకు ఆఫీసర్ సంబంధం ఎందుకు ఇష్టపడడం లేదో ఇప్పుడు అర్థమైంది!

— “అభిమన్యు”

